టెండరు.. ఎవరూ ఉండరు!



బేతంచెర్ల సమీపంలో జరుగుతున్న హైవే రోడ్డు నిర్మాణ పనులు

డోన్, మే 9: డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన చెప్పినవారికి టెండరు దక్కాల్సిందే. అది కూడా పోటీ లేకుండా టెండరు పనుల ప్రక్రియ నడవాల్సిందే. కాదని టెండరులో పాల్గొంటే బిల్లులు రావని బెదిరిస్తారు. చివరకు మంత్రి అనుకూల కాంట్రాక్టర్లకు పనులు కట్టబెడతారు. నియోజకవర్గంలో జరిగిన కాంట్రాక్టు పనుల్లో పెద్ద ఎత్తున ఇట్లా దోచుకున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆర్థిక మంత్రిగా ఉన్న బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వివిధ బ్రాండ్ల కింద డోన్ నియోజకవర్గంలో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే, సోషల్ వెల్ఫేర్ తదితర శాఖల ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. నియోజకవర్గంలో బీటీ రోడ్లకు ప్రాధాన్యత ఇచ్చి నిధులు తీసుకువచ్చారు. మంజూరైన నిధులతో చేపట్టిన బీటీ రోడ్లకు నిర్వహించిన టెండర్లలో మంత్రి బుగ్గన చక్రం తిప్పారు. దీంతో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా మంత్రి సేవలో పని చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఇందులో అధికారులకు పర్సంటేజీల రూపంలో పెద్ద మొత్తంలోనే ముట్టజెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి.

- మంత్రి చెప్పినోళ్లకే పనులు
- ఇతరులు పోటీ పడకుండా బెదిరింపులు
- తన వారికే దక్కేలా అధికారులకు ఆదేశాలు
- నెల్లూరు, కర్నూలు, హైదరాబాదు కాంట్రాక్టర్లదే హవా
- బుగ్గన బంధువుకే హైవే రోడ్డు టెండర్
- డోన్ ఇలాఖాలో ఇదో రకం దందా

● మంత్రిని కాదంటే నో టెండర్:

డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గనను కాదని కాంట్రాక్టు పనులకు టెండర్లు ఎవరూ వేయలేని పరిస్థితిని కల్పించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన కొత్తలో ప్యాపిలి నుంచి శభాష్‌పురం వరకు రూ.6 కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి టెండరు పిలిచారు. డోన్ మండలానికి చెందిన వైసీపీ నేత తనకు సంబంధించిన కాంట్రాక్టరుతో టెండరు వేయించారు. అయితే బుగ్గన నేరుగా రంగంలో దిగారు. ఇదివరకే వేరే కాంట్రాక్టరుకు మాట ఇచ్చాను.. వేసిన టెండరును వెనక్కు తీసుకోవాలని మంత్రి సొంత పార్టీ నేతపైనే ఒత్తిడి తెచ్చారు. దీంతో చేసేదేమీ లేక మంత్రి ఆదేశాలను పాటించాల్సి వచ్చింది. ఇలా నియోజకవర్గంలో మంత్రి బుగ్గనను కాదని టెండరు వేసే సాహసం చేయలేకపోయారు. ఒక వేళ ఎవరైనా టెండరు వేస్తున్నారని తెలిసినా మంత్రి కార్యాలయం నుంచి సదరు కాంట్రాక్టరుకు బెదిరింపులు వెళ్లడం సర్వసాధారణం. మంత్రి బుగ్గనను కాదని టెండరు వేసేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితిని తీసుకొచ్చారు.

● వాటర్ గ్రిడ్ పనుల్లో పర్సంటేజీల దందా...

డోన్ నియోజకవర్గంలో చేపట్టిన వాటర్ గ్రిడ్ పనుల్లో భారీ ఎత్తున పర్సంటేజీల దందా నడిచినట్లు విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో ప్రతి ఇంటికి కొళాయి, శుద్ధజలం అందించేందుకు రూ.330 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును చేపట్టారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి బేతంచెర్ల మండలంలోని బుగ్గానిపల్లె తండా ప్రాంతం వద్ద నిర్మించిన ఫిల్టర్ వాటర్ పంప్ హౌస్‌కు నీటిని తరలించి శుద్ధి చేయాల్సి ఉంటుంది. మంత్రి బుగ్గన హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఇంజనీరింగ్ కంపెనీకి ఈ ప్రాజెక్టు కాంట్రాక్టు పనులను అప్పగించారు. సదరు కంపెనీ పైపులైన్ల నిర్మాణ పనులను వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధికి సబ్ కాంట్రాక్టుగా అప్పగించినట్లు తెలిసింది. వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు పనుల్లో డోన్ నియోజకవర్గంలో ఎన్నికల ఖర్చు కోసం పర్సంటేజీల రూపంలో పెద్ద మొత్తాన్ని రాష్ట్ర స్థాయి నేతకు సమర్పించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



డోన్-రాయల్ చెరువు బీటీ రోడ్డు

మంత్రి బుగ్గన గుప్పిట్లో టెండర్లు

ఆర్థిక మంత్రి బుగ్గన ప్రాతినిధ్యం వహిస్తున్న డోన్ నియోజకవర్గంలో కాంట్రాక్టు పనుల టెండర్లన్నీ ఆయన గుప్పిట్లో పెట్టుకొని నడిపించారు. మంత్రి బుగ్గనకు సన్నిహితంగా ఉన్న నెల్లూరు, కర్నూలు, హైదరాబాదు ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లను ఏర్పాటు చేసుకున్నాడు. నియోజకవర్గంలో జరిగే కాంట్రాక్టు పనులన్నీ తన సన్నిహిత కాంట్రాక్టర్లకు అప్పగించాడు. డోన్ నుంచి రాయలచెరువు వరకు ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.52 కోట్లతో డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచారు. కాంట్రాక్టు పనుల టెండర్లలో ఎవరూ పాల్గొనరాదని మంత్రి హుకుం జారీ చేశారు. తనకు సన్నిహితంగా ఉండే నెల్లూరుకు చెందిన కాంట్రాక్టరుకు టెండరు పని వచ్చేలా పావులు కదిపారు. టెండర్లలో ఎవరూ పోటీలో పాల్గొనకుండా కాంట్రాక్టరుకు సంబంధించిన వారితోనే డమ్మీ టెండర్ వేయించడం ఇక్కడ అలవాటుగా మారిపోయింది. తర్వాత మంత్రి చెప్పిన కాంట్రాక్టరుకే టెండరు దక్కేలా అధికారులు పని చేశారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో రూ.10కోట్లకు పైగానే వివిధ పనులు చేపట్టారు. ఈ పనులను నెల్లూరుకు చెందిన కాంట్రాక్టరు దక్కించుకున్నాడు. పట్టణంలోని ప్రధాన రహదారి డబుల్ బీటీ రోడ్డు పనులను రూ.11 కోట్లతో చేపట్టగా.. నెల్లూరు చెందిన కాంట్రాక్టరుకే వాటిని అప్పగించారు. పట్టణంలో రూ.18 కోట్లతో నిర్మించిన ఆధునిక కూరగాయల మార్కెట్ టెండర్ పనులను హైదరాబాదుకు చెందిన కాంట్రాక్టరుకు అప్పగించారు. పట్టణంలోని గుత్తి రోడ్డులో రూ.35 కోట్లతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టారు. నెల్లూరుకు చెందిన కాంట్రాక్టరుకే ఈ పనులు దక్కేలా చేశారు. ఇలా డోన్, ప్యాపిలి మండలాల్లో జరిగిన బీటీ రోడ్ల పనుల్లో నెల్లూరు, హైదరాబాదుకు చెందిన కాంట్రాక్టర్ల హవా నడిచింది. కర్నూలుకు చెందిన కాంట్రాక్టరుకు అనధికారికంగా సబ్ కాంట్రాక్టు పనులు ఇచ్చినట్లు వైసీపీ నేతల్లోనే టాక్ వినిపిస్తోంది. ఈ కాంట్రాక్టు పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు పర్సంటేజీల రూపంలో రాష్ట్ర స్థాయి నేతకు పెద్ద మొత్తంలో సమర్పించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



సోమయాజులపల్లె వద్ద మంత్రి బంధువు కంకర క్రషర్ యూనిట్

మంత్రి బంధువే.. హైవే రోడ్డు కాంట్రాక్టరు

పాణ్యం నియోజకవర్గంలోని సోమయాజులపల్లె నుంచి బేతంచెర్ల మీదుగా డోన్ వరకు 300టీ జాతీయ రహదారిని రూ.650 కోట్లతో నిర్మిస్తున్నారు. ఇంత పెద్ద కాంట్రాక్టు పనులను దక్కించుకునేందుకు మంత్రి బుగ్గనే స్వయంగా రంగంలో దిగారన్న విమర్శలు ఉన్నాయి. హైదరాబాదుకు చెందిన ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండరులో పాల్గొనేలా చక్రం తిప్పారు. జాతీయ రహదారి 52 కి.మీ. మేర నిర్మాణం జరగాలి. ఎన్నికలకు ఆరు నెలల ముందు ఆగమేఘాల మీద రైతుల నుంచి భూసేకరణ చేపట్టి నిర్మాణ పనులు ప్రారంభించారు. హైవే రోడ్డు నిర్మాణానికి పెద్దఎత్తున కంకర అవసరం ఉంటుంది. దీంతో మంత్రి బుగ్గన స్వయంగా బంధువుకు సోమయాజులపల్లె వద్ద కంకర క్రషర్ ఏర్పాటు కోసం ఆగమేఘాల మీద అనుమతులు ఇప్పించారు. మంత్రి బంధువుకు సంబంధించిన క్రషర్ నుంచే హైవే రోడ్డు నిర్మాణానికి కంకరను సరఫరా చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా అనంతపురం జిల్లాలోని గుత్తి దగ్గర కూడా మంత్రి బంధువుకు కంకర క్రషర్ ఉంది. అక్కడ నుంచి కూడా డోన్ నియోజకవర్గంలో జరిగే రోడ్ల నిర్మాణ పనులన్నింటికీ కంకరను రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. హైవే రోడ్డు కాంట్రాక్టు పనుల టెండర్లను దక్కించుకున్న కంపెనీ మంత్రి బంధువుదే కావడంతో పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నట్లు విమర్శలు వెలువెత్తుతున్నాయి.

డోన్‌లో అంతా ఆ ఇద్దరిదేనట..!



డోన్/నంద్యాల (ఆంధ్రజ్యోతి) మే 9: డోన్‌లో అంతా మన పెత్తనమే జర గాలి.. మొదటిసారి పోటీ చేస్తున్న ప్రధాన పార్టీ అభ్యర్థి సహాయకులు సాగిస్తున్న నియంతృత్వ పోకడ ఇది. డోన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ప్రధాన పార్టీ అభ్యర్థి కర్నూలు నుంచి ఇద్దరు వ్యక్తిగత సహాయకులను నియమించుకున్నారు. మీడియా వ్యవహారాలను చూసే బాధ్యతలను ఆ ఇద్దరికి అప్పగించారు. అయితే వారు స్థానికంగా ఉన్న వారిని అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో చివరకు స్థానికంగా ఉన్న దిగువశ్రేణి నాయకులు కూడా ప్రధాన పార్టీ అభ్యర్థిని నేరుగా కలిసే పరిస్థితి లేకుండా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. ఎన్నికల బిజీలో ఉన్న సదరు అభ్యర్థి తెరవెనుక జరుగుతున్న ఈ వ్యవహారాన్ని గుర్తించలేకపోతున్నారని తెలుస్తోంది. ఆ ఇద్దరు సహాయకుల తీరుపై సోషల్ మీడియాలో కూడా పోస్టింగులు హల్‌చల్ చేస్తున్నాయి. కర్నూలు నుంచి వచ్చిన ఆ ఇద్దరి పని తీరు అభ్యర్థికి ఉపయోగపడేలా ఉండాల్సింది పోయి నష్టం చేకూర్చేలా ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. సదరు అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్ బాగున్న తరుణంలో ఇలాంటి వ్యవహారం కాస్త తలనొప్పిగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. '13 తరువాత వారు వెళ్లిపోతారు.. ఆ తరువాత మేమే కావాలి.. లోకల్‌గా ఉన్న మమ్మల్ని గుర్తించండి అన్న' అని సోషల్ మీడియాలో పెట్టిన ఓ మెసేజ్ వైరల్ కావడంతో డోన్‌లో చర్చనీయాంశంగా మారింది.

ఈసారి మా ఓట్లు మీకే.. కానీ...



బురదమయంగా ఉన్న రహదారిని బాగు చేయించాలని కోరుతున్న మహిళలు

ఆత్మకూరు, మే 9: ఈసారి మా ఓట్లన్నీ మీకే వేస్తాం. గెలిస్తే మా వీధిలో సీసీ రోడ్డు వేయండని కరివేన గ్రామంలోని సీతయ్యపేట కాలనీవాసులు బుడ్డా రాజశేఖరరెడ్డిని కోరారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన కరివేన గ్రామంలో పర్యటించారు. ఈ క్రమంలోనే సీతయ్యపేటకు వెళ్లగా అక్కడికి భారీగా మహిళలు గుమిగూడి తమ కాలనీకి సీసీ రోడ్డు లేక వర్షాకాలంలో చాలా అవస్థలు పడుతున్నామని వాపోయారు. బుడ్డా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఒక్క కరివేన గ్రామంలోనే రూ.4 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టామని, ఇప్పుడున్న రోడ్లన్నీ తాను వేయించిన వేనని చెప్పారు. అయితే ఐదేళ్లలో ఎమ్మెల్యే శిల్పా కరివేన గ్రామంలో ఎలాంటి అభివృద్ధి చేయకపోయినా గత ఎన్నికల్లో 1200 ఓట్లు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటికైనా పనిచేసే నాయకులెవరో గుర్తించాలని కోరారు. దీంతో లక్ష్మీదేవి అనే మహిళ స్పందిస్తూ ఈసారి ఎన్నికల్లో మా ఓట్లన్నీ మీకే వేస్తాం.. గెలిచాక మావీధిలో రోడ్డు వేయించండని కోరగా కచ్చితంగా రోడ్డు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే పాడుబడిన బావిని పూడ్చమని కోరగా సొంత ఖర్చులతోనైనా చేయిస్తానని చెప్పారు. కాగా రామాలయంలో సమీపంలోని మరో రహదారి బురదమయంగా మారడంతో అక్కడి మహిళలు రోడ్డు వేయించాలని ఆయన్ని కోరారు.

ఓటు కోసం నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆత్మకూరు రూరల్, మే 9: ఓటు హక్కును కల్పించాలని ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసీ ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం గంట పాటు ధర్నా చేపట్టారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పలువురు ఫారం 12డీలతో తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. కాగా వారికి బ్యాలెట్ పత్రాలు లేవంటూ ఎన్నికల అధికారులు వారించారు. తాము ఎన్నికల విధుల్లో భాగంగా మే 13న పలు ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లాల్సి ఉందని, ఈ రోజు చివరి రోజని తమకు ఎలాగైనా ఓటు హక్కును కల్పించాల్సిందేనని కోరారు. అనంతరం గంటపాటు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. దీంతో డీటీ మనోహర్ ఈ విషయాన్ని ఆర్వో సుధారాణి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్వో స్పందిస్తూ వారికి ప్రత్యేక అధికరణల ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు తాను అవకాశం కల్పిస్తానని చెప్పారు. వారికి బ్యాలెట్ పత్రాలను సమకూర్చి స్థానిక డీపాల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే సదుపాయాన్ని కల్పించారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు చివరకు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటరు కార్డుకు 30 ఏళ్లు

● **1957లో ప్రతిపాదన.. 1993లో సాకారం**



ఆదోని, మే 9: ఓటరు గుర్తింపు కార్డు అమలులోకి వచ్చి 30 ఏళ్లవుతోంది. దొంగ ఓట్లను అరికట్టేందుకుగాను... 1957 సార్వత్రిక ఎన్నికల తరువాత అప్పటి బెంగాల్ ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేసింది. ఈ మేరకు 1961లో కోల్‌కతా నైరుతి లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేసేలా అప్పటి ప్రభుత్వం చట్టంలో కొన్ని మార్పులు చేసింది. కానీ, అప్పటికి ఉన్న వనరుల కారణంగా అది సాధ్యం కాదని భావించి, దానిని అమలు చేయలేదు. టీఎన్ శేషన్ సీఈసీ అయ్యాక ఓటరు గుర్తింపు కార్డులు ఇవ్వకుంటే ఎన్నికలు జరగవని ప్రకటించారు. దీంతో కేంద్రం 1993 ఆగస్టులో తొలి సారి గుర్తింపు కార్డులు జారీ చేసింది. అప్పట్లో అవి నలుపు, తెలుపు రంగుల్లో మాత్రమే ఉండేవి. 2015 నుంచి డిజిటల్ విధానంలో రంగుల్లో ముద్రిస్తున్నారు.

నందికొట్కూరులో త్రిముఖ పోరు

● టీడీపీ, వైసీపీ మధ్య ప్రధాన పోటీ ● గుబులు పుట్టిస్తున్న కాంగ్రెస్ పార్టీ





నందికొట్కూరు, మే 9: నందికొట్కూరు నియోజకవర్గంలో ప్రధానంగా టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య, వైసీపీ అభ్యర్థి ధారా సుధీర్‌ల మధ్య బలమైన పోటీ నెలకొంది. టీడీపీలో గిత్తా జయసూర్య గెలుపు కోసం మాండ్ర శివానందరెడ్డి పోరాటం చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి ధారా సుధీర్ విజయం కోసం బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కృషి చేస్తున్నారు. నందికొట్కూరు నియోజకవర్గం ఏర్పడిన 1952 నుంచి కాంగ్రెస్ పార్టీదే హవా సాగింది. 1955, 1967, 1972, 1978, 1989, 2004, 2009లలో కాంగ్రెస్ ఎనిమిదిసార్లు విజయం సాధించగా, 1985, 1994, 1999లలో టీడీపీ మూడు సార్లు గెలుపొందింది. 2014, 2019లలో వైసీపీ విజయం సాధించింది. ప్రస్తుతం హ్యాట్రిక్ సాధించాలని వైసీపీ పావులు కదుపుతోంది. అయితే 20 ఏళ్లుగా టీడీపీ అధికారానికి దూరంగా ఉంది. ఈ సారి విజయం కోసం ఆ పార్టీ నాయకులు ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నారు. ఇందులో భాగంగా టీడీపీ, వైసీపీ నేతలు ఎత్తులకు పై ఎత్తులు వేసుకుంటూ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు.

● టీడీపీ ప్రచార జోరు:

టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య ప్రచారం జోరుగా సాగిస్తున్నారు. రోజుకు రెండు మండలాల్లో ప్రచారం చేస్తున్నారు. మరో వైపు మాండ్ర శివానందరెడ్డి మరో రెండు మండలాలను కవర్ చేస్తూ ప్రచారం సాగిస్తున్నారు. అలాగే మాండ్ర లింగారెడ్డి ఇంటింటి ప్రచారం పూర్తి చేసిన అనంతరం పగిడ్యాల, నందికొట్కూరు మండలాల్లోని ఉపాధి కూలీల వద్ద ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచార అనుమతులు, పార్టీ అంతర్గత వ్యవహారాలను మాండ్ర ఉమాదేవి పర్యవేక్షిస్తూ ఇలా ఎవరికి వారు గిత్తా జయసూర్య గెలుపు కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారు.

● గిత్తా గెలుపు కోసం మాండ్ర కుటుంబం పోరాటం:

గిత్తా జయసూర్య గెలుపునకు మాండ్ర శివానందరెడ్డి, ఆయన సోదరుడు మాండ్ర లింగారెడ్డి, మాండ్ర ఉమాదేవిలు తీవ్రంగా పోరాటం చేస్తున్నారు. గత ఎన్నికల్లో విఫలం కావడంతో ఈ సారి నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేసి తమ సత్తా చాటుకోవాలని మాండ్ర శివానందరెడ్డి తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు.

● బైరెడ్డి శబరి పోటీ గిత్తాకు కలిసి రానుందా?

గిత్తా జయసూర్య గెలుపు కోసం మాండ్ర కుటుంబ సభ్యులు, టీడీపీ కార్యకర్తలు అవిశ్రాంతంగా పని చేస్తున్నారు. అయితే నంద్యాల ఎంపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరి సొంత నియోకవర్గం నందికొట్కూరు కావడం గిత్తాకు కలిసి రానుందని విశ్లేషకులు చెబుతున్నారు.

● వైసీపీకి కాంగ్రెస్ ఎఫెక్ట్ ?

ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్‌కు వైసీపీ టిక్కెట్ ఇవ్వకుండా నిరాశ చూపడంతో పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. కానీ ప్రస్తుతం ఎమ్మెల్యేకు అండగా ఉన్న క్యాడర్ మొత్తం టీడీపీలో చేరుతోంది. దీంతో తోగూరు ఆర్థర్ వల్ల వైసీపీ ఓటు చీలుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌తో పాటు సీబీఐ మాజీ జేడీ లక్ష్మినారాయణ స్థాపించిన జైభారత్ నేషనల్ పార్టీ ప్రభావం చూపనుంది. ఈ పార్టీ నుంచి బొళ్లవరం గ్రామానికి చెందిన బోరెల్లి వెంకట్రాముడు బ్యాటరీ టార్చ్ సింబల్‌తో నందికొట్కూరు బరిలో ఉన్నారు.

జయసూర్య బలాలు..

● గిత్తా జయసూర్య బలం: చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలకు ప్రజలు ఆకర్షితులు అవుతున్నారు. టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి గిత్తా జయసూర్యకు బలం.

బలహీనతలు..

టీడీపీలో ఉన్న పాత వర్గాన్ని కలుపుకుపోవడం లేదన్న విమర్శలు

సుధీర్ బలాలు..

వరుసగా రెండు విజయాలు ధారాకు బలం చేకూర్చుతున్నాయి. ధనబలం, పైగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మద్దతు ఆయనకు బలంగా నిలుస్తున్నాయి.

బలహీనతలు..

వరుస రెండు విజయాలతో ఉన్న వైసీపీకి ఈ సారి ప్రజల్లో వ్యతిరేకత ఉండడంతో పాటు, స్థానికేతరుడు అనే ప్రచారం జరుగుతోంది. 2014, 2019లలో గెలిచినా కూడా ఈ పదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యం.

ప్రలోభాలపై దృష్టి పెట్టాలి

ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్



మాట్లాడుతున్న నినా నిగమ్

కర్నూలు(కలెక్టరేట్), మే 9: నగదు, మద్యం ఓటర్లను ప్రలోభపరిచే వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్, ఐఆర్ఎస్ (రిటైర్డ్) అధికారి ఎక్స్‌పెండీచర్ టీమ్స్‌ను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాధారణ ఎన్నికల నిర్వహణపై జనరల్ అబ్జర్వర్, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎన్నికల వ్యయ పరిశీలకులతో కలిసి ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీనా నిగమ్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. మద్యం దుకాణాలు, బార్లను తనిఖీ చేసే సమయంలో సీటింగ్ సామర్థ్యాన్ని బట్టి మద్యం అమ్మకాలు ఉన్నాయా లేదా అనేది చూడాలన్నారు. అనంతరం ఎన్నికలు సజావుగా జరిగేందుకు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిలా కలెక్టర్, ఎస్పీలతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్ఐ జయరాం రెడ్డిపై వేటు

ఆదోని, మే 9: వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఆదోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) జయరామ్‌రెడ్డిపై ఎన్నికల సంఘం వేటు వేసింది. అధికార పార్టీ వైసీపీ ఎమ్మెల్యే చెప్పినట్లు పనులు చేయడమేగాకుండా.. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఆర్ఐ జయరాం రెడ్డి వ్యవహరిస్తున్నారని బీజేపీ, టీడీపీ నాయకులు ఎన్నికల సంఘానికి పిర్యాదు చేశారు. స్పందించిన ఎన్నికల సంఘం ఆదోని రిటర్నింగ్ అధికారి సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మకు ఆర్ఐపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరింది. దీంతో విచారణలో నిజమని తేలడంతో ఆర్ఐ జయరామ్ రెడ్డిని జిల్లా కలెక్టర్‌కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన విధుల నుంచి రిలీవ్ అయినట్లు సమాచారం.

వనిత మాట

చాగలమర్రి, మే 9:

వడ్డీ లేని పొదుపు రుణాలు మేలు



ఉమ్మడి మేనిఫెస్టోలో మహిళలకు పొదుపు రుణాలు వరం. మహిళా సంఘాలకు వడ్డీ లేకుండా రూ.10 లక్షల వరకు రుణం ఇస్తామనడం ఆనందంగా ఉంది. పెళ్లి కానుక కింద రూ.లక్ష అందించడం వల్ల పేదలకు ఎంతో భరోసా కల్పించినట్లవుతుంది. ఉమ్మడి మేనిఫెస్టోతోనే మహిళల సాధికారత సాధ్యం. మహిళలకు ఆదరణ కల్పించిన వారికే ఓటు వేస్తాం.

- గంగుల ఆదిలక్ష్మి, చాగలమర్రి

మూడు గ్యాస్ సిలిండర్ల వల్ల ఉపశమనం



టీడీపీ, జనసేన, బీజేపీ మేనిఫెస్టోలో మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్న హామీ ఆనందంగా ఉంది. దీని వల్ల ఆరు నెలల పాటు గ్యాస్ కొనాల్సిన అవసరం లేదు. చాలా మంచి పథకం. ఏడాదికి ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తే ఆర్థిక భారం నుంచి కొంత ఉపశమనం లభించినట్లవుతుంది. ఈ మేనిఫెస్టోలో మహిళలకే వరాలు అధికంగా ఉండటం సంతోషం.

- లక్ష్మీ కల్యాణి, చాగలమర్రి

ఉచిత బస్సు ప్రయాణం మంచి పథకం



ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే పథకం చాలా మంచిది. తెలంగాణలో ఈ పథకం అమలులోకి రావడంతో అన్ని వర్గాల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ సూపర్-6లో భాగంగా ఆర్టీసీ బస్సులో మహిళలు ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇవ్వడం మంచి పరిణామం. పేద మధ్యతరగతి మహిళలకు రవాణా ఖర్చు తగ్గుతుంది. ప్రజా రవాణా పెరుగుతుంది. మహిళలను ఆదరించే వారికే ఓటు.

- పి.చంద్రకళ, చాగలమర్రి

పేదలు విద్యావంతులు అవుతారు



పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ప్రకటించడం వల్ల పేద విద్యార్థులు విద్యావంతులవుతారు. ఆడబిడ్డ నిధి ద్వారా రూ.1,500 నెలకు ఇస్తామంటున్నారు. ఆపై తల్లికి వందనం ద్వారా పిల్లలు ఎంత మంది ఉంటే అంత మందిని బడికి పంపినందుకు రూ.15 వేలు చొప్పున అందిస్తామంటున్నారు. ఉమ్మడి మేనిఫెస్టోలో మహిళలకే వరాలు అధికంగా ఉన్నాయి. సూపర్-6 పథకాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. మహిళలకు అండగా ఉండే పార్టీకే మా ఓటు.

- సుబ్బలక్ష్మి, చాగలమర్రి

ఓటరు నాడి..

విలువలు లేకుండా పోయాయి



ప్రస్తుతం రాజకీయాల్లో విలువలు, అంకిత భావం లేకుండాపోయాయి. అప్పట్లో ఎన్నికల ప్రచారం ఇంత ఆర్భాటంగా ఉండేది కాదు. ఎన్నికల ప్రచారానికి అభ్యర్థితోపాటు నాయకులు గ్రామాలకు వచ్చిన నేరుగా ప్రచారానికి వెళ్లేవారు కాదు. గ్రామంలోని ఐదారుగురు పెద్ద మనుషులతో మాట్లాడి ఒక చోట సమావేశాన్ని ఏర్పాటు చేసేవారు. గ్రామంలోని సమస్యలు తెలుసుకొని గెలిస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చేవారు. గ్రామ పెద్దల మాట మీద వారికి ఓటు వేసే వాళ్లం. ఇప్పుడు ఎన్నికలంటే ఖర్చుతో కూడుకున్నాయి. అప్పట్లో మద్యం, డబ్బులు పంపిణీ చేసేవాళ్లు కాదు. నిజాయితీగా ఓటు వేసేవాళ్లు.

పద్మావతమ్మ, మహిళ, చింతలచెరువు గ్రామం

నచ్చిన వ్యక్తికి ఓటు వేస్తాం




అప్పటి ఎన్నికలకు, ఇప్పటికీ చాలా తేడా ఉంది. నా వయస్సు 80 ఏళ్లు. చాలా ఎన్నికలు చూశా. అప్పటికి ఇప్పటికి ఎంతో తేడా ఉంది. ఇంత హంగు, అర్భాటాలు అప్పుడు ఉండేవి కావు. అప్పట్లో రెండు పార్టీలే ఉండేవి. మద్యం ప్రవాహం ఉండేది కాదు. ఇప్పుడు రాజకీయంగా డబ్బుతోనే నడుస్తోంది. అప్పట్లో మంచి, మర్యాదలతోనే పనులు చేసేవారు.

- టి.తిరుపాల్‌రెడ్డి, చిన్నవంగలి గ్రామం

పోలింగ్ టూర్

- ఎక్కడెక్కడో ఉన్న వారికి ఫోన్ చేసి పిలుస్తున్న అభ్యర్థులు
- వచ్చి వెళ్లేందుకు అయ్యే ఖర్చు, బాధ్యత వారిదే...



ఆదోని, మే 9: ఊరికి పోదాం... చలో చలో.. ఓటు వేద్దాం చలో చలో..... వృత్తి, ఉపాధి రీత్యా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పూణె, ముంబై తదితర నగరాలకు వలస వెళ్లిన ఆంధ్రవాసులందరి నోటా ఇప్పుడు ఇదే మాట..! వీరందరి రాకతో శనివారం నుంచి సోమవారం దాకా ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలన్నీ కళకళలాడనున్నాయి. ఎందుకంటే.. ఉపాధి పొందుతున్న వారికి పోలింగ్ రోజైన సోమవారం సెలవు. మంగళవారం సెలవు పెట్టుకుంటే. శని, ఆది వారాలు ఎలాగు సెలవు రోజులే. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేశారు. మంగళవారం సెలవు పెట్టుకుంటే చాలు... ఓటు వేయడానికి వచ్చి నాలుగు రోజుల పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడిపే అవకాశం ఉండడంతో చాలా మంది ఉత్సాహం చూపుతున్నారు.

● పక్కాగా ఏర్పాట్లు..

ఒక్కటి కూడా మిస్ అవ్వకూడదు... మనకే పడాలి..... మన సెగ్మెంట్ ఓటర్లు ఏయే ప్రాంతాల్లో ఉన్నారో గుర్తించండి. వారిని పిలిపించండి.... ఎంత ఖర్చైనా మనమే భరిద్దాం... అంటూ అభ్యర్థులు తమ కేడర్‌కు ఆదేశిస్తున్నారు. ఓటర్ల జాబితాలో పేరు ఉండి, ఉపాధి రీత్యా వేరే ప్రాంతాలకు వెళ్లిన వారిని ఎక్కడున్నా సరే పిలిపించి మరీ ఓటు వేయించేందుకు సిద్ధమైన అభ్యర్థులు.. గ్రామాల వారీగా ఓటర్ల జాబితాను వడబోస్తున్నారు. వేరే ప్రాంతాల్లో ఉంటున్న వారితో ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు. ఐటీ సహా ఇతర ఉద్యోగాలకు కోసం వెళ్లిన ప్రతి ఒక్కరినీ ఆదివారం సాయంత్రంలోగా నియోజకవర్గానికి తీసుకువచ్చేందుకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. వారికి ఫోన్ చేసి.. ఇతర పార్టీల వారెవరైనా వారితో మాట్లాడారా..? ఒకవేళ మాట్లాడి ఉంటే వారు ఏం హామీలిచ్చారు..? అనే విషయాలు కూడా తెలుసుకుంటున్నారు. వారిచ్చిన హామీలకంటే ఎక్కువ ఇచ్చి అయినా సరే, ఓటు తమకే పడేలా ప్లాన్ చేస్తున్నారు. అడ్వాన్స్‌గా పేమెంట్ యాప్‌ల ద్వారా ఎంతో కొంత మెత్తం వారి ఖాతాల్లో వేస్తున్నారు. వారు వచ్చి వెళ్లడానికి అయ్యే ఖర్చులను భరించడానికి సిద్ధమవుతున్నారు. జిల్లాలోని ఓ నియోజకవర్గానికి చెందిన ఓక గ్రామంలోని నలుగురు ఓటర్లు ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉంటున్నారు. ఓటర్ల జాబితాలో వారిని గుర్తించిన ఓ అభ్యర్థి తాలుకా అనుచరులు.. అక్కడి వారికి ఫోన్ చేసి వచ్చి వెళ్లేందుకు అయ్యే ఖర్చుతో సహా అన్ని తామే చూసుకుంటామని, ఓటు మాత్రం కచ్చితంగా తమ నేతకే వేయాలంటూ కోరారు. అక్కడి నుంచి ఇక్కడికి వచ్చి ఓటేసే వరకు.. వస్తున్నట్టు ఎవరికి చెప్పొద్దని అభ్యర్థించారు. ఆ ఒక్క నియోజకవర్గమే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల ఇవే పరిస్థితులు కనబడుతున్నాయి. హైదరాబాద్, బెంగళూరు చెన్నై తదితర పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న వారిని నియోజకవర్గాలకు రప్పించడానికి.. పలువురు అభ్యర్థులు ఏకంగా కార్లు కూడా సిద్ధం చేస్తున్నారు.



● ఫస్ట్ టైమ్ ఓటర్స్ ముఖ్యం..

ఈ ఎన్నికల్లో మొదటిసారి ఓటు హక్కు వచ్చిన విద్యార్థులు, యువత కూడా ఓటు వేసేందుకు గ్రామాలకు వెళ్తున్నారు. వారు కూడా తమకే ఓటు వేసేలా పలు పార్టీల అభ్యర్థులు, క్యాడర్ జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోబోయే వారు ఎవరికి దగ్గరగా ఉంటారు, ఎవరితో చెప్పిస్తే తమకు ఓటు వేస్తారనే అంశాలను బేరీజు వేసి మరీ వారితో సంప్రదింపులు జరుపుతున్నారు.

ఓటర్ కార్డు లేకున్నా ఓటెయ్యొచ్చు



ఆదోని, మే 9: ఈ ఏడాది కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న వారికి ఎన్నికల సంఘం తపాలా శాఖ ద్వారా ఓటరు గుర్తింపు కార్డులు పంపుతోంది. అయితే.. చాలా మందికి ఇవి ఇంకా అందలేదు. పాత ఓటర్లలో సైతం పలువురి వద్ద ఓటరు కార్డులు లేవు. ఇలాంటి వారంతా ఇతర గుర్తింపు కార్డులు చూపించి ఓటు వేయొచ్చని అధికారులు చెబుతున్నారు.

అవి ఏంటంటే..

- ఆధార్ కార్డు ● ఉపాధి హామీ కార్డు
- పోస్టాఫీస్, బ్యాంక్ జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్
- కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్ ● పాన్‌కార్డు
- ఆర్జీఐ స్మార్ట్ కార్డు ● ఇండియన్ పాస్‌పోర్టు
- ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలకు చెందిన ఫొటోతో కూడిన గుర్తింపు కార్డు
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎంపీ జారీ చేసిన అధికార గుర్తింపు పత్రం
- దివ్యాంగులకు ఇచ్చే గుర్తింపు కార్డు.

ఎన్నికలకు సహకరించాలి: కలెక్టర్



కర్నూలు(కలెక్టరేట్), మే 9: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ప్రవర్తనా నియామవళి తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ ఎన్నికల భాగంగా జిల్లాలో 2204 పోలింగ్ స్టేషన్లు, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామని, గర్భిణులు, దివ్యాంగులు ఉన్నట్లయితే వారికి అక్కడే ఉన్న ఎన్ఎస్ఎస్ లేదా ఎన్సీఈసీ వారు సహాయకారిగా ఉండి ఓటు వేయిస్తారన్నారు. జిల్లాలో 40 ప్రత్యేక పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2204 పోలింగ్ స్టేషన్లలో 18 వల్నరబుల్ పోలింగ్ స్టేషన్లు, 320 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు మొత్తం 338 ఉన్నాయని తెలిపారు. పోలింగ్ రోజు ప్రతి నియోజకవర్గానికి ఈవీఎంల పర్యవేక్షణకు గానూ ముగ్గురు బెల్ ఇంజనీర్లను కూడా ఉంటారని చెప్పారు. 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రచారాలు ముగించాలన్నారు. 7 గంటల నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. 11వ తేదీ నుంచి 13వ తేదీ రాత్రి వరుకు ఎలాంటి మద్యం అమ్మకాలు జరగరాదన్నారు. 13న లోకల్ హాలిడే కూడా ప్రకటించామని పేర్కొన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు మూడు వాహనాలకు మించి వాడరాదని తెలిపారు. ఆ వాహనంలో కూడా ఐదుగురి కంటే ఎక్కువ మంది ప్రయాణించరాదన్నారు. పోలింగ్ రోజు, అంతకంటే ముందు రోజు మాత్రమే పత్రికల్లో ప్రకటనలు ఇచ్చుకోవచ్చన్నారు. ఇందుకు సర్టిఫికేషన్ తీసుకుని యాడ్స్ వేయించుకోవాలని, ఎలక్ట్రానిక్ మీడియాకు మాత్రం యాడ్స్ ఇవ్వరాదని రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ మురళి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో బీవీ మాటా మంతి



నందవరం: ప్రచారంలో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ జయ నాగేశ్వరరెడ్డి ఉపాధి కూలీలతో గురువారం హలహర్వి దగ్గర మాటా మంతి కలిపారు. ఉపాధి కూలీలకు గిట్టు బాటు ధర కల్పిస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. మీకు టీడీపీ వచ్చిన వెంటనే కూలీ ధర పెంచుతామని హామీ ఇచ్చారు.

మా నాన్నను గెలిపించండి



హొళగుంద : హొళగుంద మండల కేంద్రంలో ఆలూరు టీడీపీ అభ్యర్థి కుమార్తె ఐశ్వర్య మహిళలతో మమేకమయ్యారు. మహిళలతో కలసి వెల్లుల్లిని శుభ్రం చేస్తూ వారితో మాట్లాడారు. తన తండ్రిని గెలిపించాలంటూ ఆమె ఓటర్లను అభ్యర్థించారు

బజ్జీలు వేస్తూ..



నంద్యాల టౌన్ : కాంగ్రెస్ పార్టీ నంద్యాల ఎంపీ అభ్యర్థి జె.లక్ష్మీ నరసింహ యాదవ్ తనదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు. నంద్యాల పట్టణంలో ఇలా బజ్జీల బండి వద్ద బజ్జీలు వేస్తూ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలంటూ ఆయన ఓటర్లను కోరారు.

అవ్వా... ఓటుతో ఆశీర్వదించు



కోసిగి : కోసిగి మండలంలోని ఐరంగల్ గ్రామంలో మంత్రాలయం టీడీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వృద్ధులను ఆప్యాయంగా పలకించారు. తనను గెలుపునకు మీ ఆశీర్వాదం కావాలంటూ వృద్ధులను కోరారు.

బీసీకి ఘన స్వాగతం




అవుకు : అవుకు మండలంలోని రామాపురంలో గురువారం బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభిమాన నాయకుడు రావడంతో గ్రామస్థులందరూ కలసి గజమాలతో బీసీకి ఘన స్వాగతం పలికారు.

మద్యం సిద్ధం

- దుకాణాల నుంచి రహస్యంగా వైసీపీ డంపుల్లోకి
- జిల్లాలో సిద్ధం సభలకు ముందే మద్యం నిల్వలు
- అడ్డదారుల్లో పొరుగు రాష్ట్రాల మద్యం దిగుమతి
- మద్యం బాబులు అడిగితే నోస్టాక్..
- స్కానర్లు పని చేయడం లేదని సాకు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖాధికారులు





కర్నూలు(అర్బన్), మే 9: మద్యం లేకుండా ఎన్నికల్లో గెలవడం ఎట్లా? అందుకే కోడ్ రావడానికి ముందే వైసీపీ మద్యాన్నంతా దాచేయానుకుంది. మద్యం నిల్వలను సిద్ధం చేసుకుంది. పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంది. అవకాశం లేని నియోజకవర్గాల్లో ప్రభుత్వ దుకాణాలపై ఆధారపడింది. రాత్రిళ్లు మద్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం. జగన్ సిద్ధం సభలకు ముందే ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైసీపీ నాయకులు మద్యం సమకూర్చుకున్నట్లు సమాచారం. అధికార పార్టీ నాయకులకు పోలీసు, సెబ్, ఎక్సైజ్ అధికారులు సహకరిస్తున్నట్లు విమర్శలున్నాయి. తెలంగాణ, కర్నాటకకు చెందిన మద్యాన్ని కర్నూలు, ఆలూరు, కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోని సరిహద్దు గ్రామాల్లో డంపింగ్ నిల్వలు సిద్ధం చేసుకున్నట్లు ఎక్సైజ్ విభాగానికి చెందిన కొందరు అధికారులు, సిబ్బంది చర్చించుకోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఎన్నికల నేపథ్యంలో వైసీపీ నాయకులు అడ్డదారుల్లో ప్రభుత్వ మద్యాన్ని సొంతం చేసుకుంటున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని నేరుగా గోడౌన్ల నుంచే తరలిస్తున్నట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాల నుంచి సైతం రాత్రిళ్లు నిబంధనలకు విరుద్ధంగా కేసుల కొద్దీ మద్యం కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు మద్యం దుకాణాల ఉద్యోగులు వైసీపీ నాయకులకు అన్ని విధాలా సహకరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మందు బాబులు వెళితే నో స్టాక్ అని చెబుతున్నారు. స్కానర్లు పని చేయట్లేదని, వెబ్ సైట్ రావట్లేదని సాకులు చెప్పి, వెనుక నుంచి వైసీపీ డంప్‌లకు మద్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు బలం చేకూరేలా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు చెక్ పోస్టుల్లో 42 కేసులు నమోదు కాగా 49 మందిని అదుపులో తీసుకుని 23 వాహనాలను సీజ్ చేశారు. గతనెల 4వ తేదీన రూ. 14.50 లక్షల తెలంగాణ మద్యం కడప జిల్లాకు తరలిస్తూ పట్టుబడటం వైసీపీ మద్యం నిల్వల ఉదంతాన్ని బలపరుస్తోంది. చెక్‌పోస్టుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది దాడుల్లో తమ వాహనాలను చూసీ చూడనట్లు వదిలేయాలని వైసీపీకి చెందిన కొందరు నాయకులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

కఠినంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు

ఎన్నికల కమిషన్ ప్రకారమే విక్రయిస్తున్నాం. ఎక్కడైనా ఫిర్యాదు అందితే వెంటనే అక్కడ చేరుకుని చర్యలు తీసుకుంటాం. డిజిటల్ ద్వారానే ఎక్కువ శాతం అమ్మకాలు జరగాలని ఎన్నికల కమిషనర్ ఆదేశాలు ఉన్నాయి. స్కాన్ కాకుండా బాటిళ్లు బయటకు పోయే సమస్య ఉండదు.

- చంద్రహాసన్, సీఐ ఎక్సైజ్

మద్యం కీలకం: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ నాయకులు మద్యాన్ని కీలక అస్త్రంగా వాడుకుంటున్నారు. ఎరగా వేసి, కీలక వ్యక్తులను గుప్పిట్లో పెట్టుకుంటున్నట్లు సమాచారం. ఎన్నడూ లేని విధంగా అధికార పార్టీ మాఫియా నియోజకవర్గ కేంద్రాల్లో రంగ ప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేతలు కొంత మంది నియోజకవర్గాల వారిగా ప్రధాన గోడౌన్లు, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం కేస్‌లను రహస్యంగా ఇప్పటికే తరలించి, డంప్ చేసుకున్నట్లు ఆ పార్టీకి చెందిన నాయకులే చర్చించుకుంటున్నారు. వారు మండల కేంద్రాల్లోని ఆ పార్టీ బూత్ ఏజెంట్లకు ఇప్పటికే డబ్బు, మద్యం కేస్‌లు అందించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొంత మంది సిబ్బంది, అధికార పార్టీ నాయకుల నుంచి ముందస్తుగా డబ్బు తీసుకుని స్కానింగ్ చేసి, వారికి రాత్రికి రాత్రే రహస్యంగా మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారం. మందు కోసం వెళ్లిన మద్యం ప్రియులకు స్టాక్ అయిపోయిందని చెబుతున్నారు. గట్టిగా నిలదీస్తే తాము అధికార పార్టీ కార్యకర్తలమని, తమనే ఎదిరిస్తావా అంటూ ఎదురు దాడికి దిగుతున్నట్లు సమాచారం. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మద్యం దుకాణాలను తెరిచి ఉంచాలి. అయితే మద్యం స్టాక్ అయిపోయిందని, తాము ప్రభుత్వ ఆదేశాల మేరకే నడుచుకుంటున్నామని చెబుతూ రహస్యంగా మద్యాన్ని బెల్టు షాపులకు అందిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదంతా పబ్లిక్ గానే సాగుతున్నా.. ఎక్సైజ్ శాఖాధికారులు పట్టించుకోవట్లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బీఎల్‌ఓ సస్పెండ్

కర్నూలు(న్యూసిటీ), మే 9: కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఓటరు స్లిప్పులను పంపిణీ చేయకుండా అలసత్వం వహించిన బీఎల్‌ఓ శివప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఆర్‌ఓ ఎ.భార్గవతేజ ఉత్తర్వులు జారీ చేశారు. 1,141 ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేస్తే కేవలం 138 స్లిప్పులను పంపిణీ చేయడంతోపాటు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిన బీఎల్ ఓను సస్పెండ్ చేశారు. పాతబస్టాండు నాగప్ప వీధిలోని 131వ సచివాలయంలో శివప్రసాద్ వీఆర్‌ఓగా పనిచేస్తున్నారు.

వైసీపీ ఓటమి ఖాయం

గూడూరు, మే 9: సార్వత్రికల్లో వైసీపీ ఓటమి ఖాయమని మండల టీడీపీ నాయకుడు కె కృష్ణ అన్నారు. గురువారం గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామంలో టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ టీడీపీ విజయాన్ని ఎవ్వరూ అపలేరన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురువ వెంకట్రాముడు, ఎంపీటీసీ మద్దిలేటి, కెఎం రవి, కర్ణం చిన్న గిడ్డయ్య, పత్తి రవి, ఓబులేష్, నాగేష్, బ్రహ్మయ్య, సుంకన్న పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

సి.బెళగల్, మే 9: మండలంలోని ఈర్లదిన్నె గ్రామంలో టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించి, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ నాయకుడు శేషన్న మాట్లా డుతూ సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించా లని కోరారు. అలాగే మండలంలోని కొండాపురం, బురాన్‌దొడ్డి, గుండ్రేవుల గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మా జిక్యప్రభు, పెద్దప్రభు, రేపల్లె పౌలు, హనుమంతు, రాజు, రాముడు పాల్గొన్నారు.

లూపస్ దీర్ఘకాలిక వ్యాధి


ఎ. సృజన

కర్నూలు(హాస్పిటల్), మే 9: లూపస్ దీర్ఘకాలిక వ్యాధి అని కర్నూలు మెడికవర్ హాస్పిటల్, జీవన్ రాయలసీమ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ రుమటాలజిస్టు డా. ఎ. సృజన అన్నారు. ఈ మేరకు వరల్డ్ లూపస్ డేను పురస్కరించుకుని గురువారం ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి స్త్రీలలో 15-45 సంవత్సరాల వారికి వస్తుందని అన్నారు. ఈ స్ట్రోజెన్ హార్మోన్ ప్రభావం వల్ల సహజంగా వస్తుందని తెలిపారు. ఎస్ఎల్ఈ అన్ని రకాల అవయవాల మీద ప్రభావం చూపుతుందన్నారు. జ్వరం రావడం, ముక్కు చెంప మీద మచ్చలు ఎర్రని దద్దుర్లు, కీళ్ల నొప్పులు, జుట్టు రాలిపోవడం లక్షణాలు ఉంటాయన్నారు. రుమటాలజిస్టు డాక్టర్ వద్దకు వెళ్లి ప్రారంభ దశలో చికిత్స చేయించుకోవాలని సూచించారు.

వైసీపీ అరాచక శక్తులను ఓడించాలి: సీపీఎం


సీపీఎం ప్రచార రథాన్ని అడ్డుకుంటున్న వైసీపీ మూకలు

ఓర్వకల్లు, మే 9: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అరాచక శక్తులను ఓడించాలని సీపీఎం పాణ్యం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్, నంద్యాల పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి జే.లక్ష్మీనరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం నన్నూరు గ్రామంలో సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు పి.మధు ఆధ్వర్యంలో రోడ్‌షో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎం ప్రచారం నిర్వహిస్తుండగా.. వైసీపీ మూకలు తప్ప తాగి ప్రచారం రథంపై దాడి చేసి వైసీపీ నాయకులు చెన్నారెడ్డి ఆధ్వర్యంలో మూకలు రోడ్‌షోను అడ్డుకున్నారని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని రెచ్చగొడుతూ తమ ప్రచార రథంపై దాడి చేశారన్నారు. ఈ దాడిని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రామకృష్ణ ఖండించారు. వెంటనే పోలీసులు చెన్నారెడ్డి, వైసీపీ మూకలపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పఠాన్ హబీబ్‌ఖాన్, మధు, బి.నాగన్న, శ్రీధర్, షాజహాన్, మధుసూదన్, వెంకటేశ్వర్లు, మాసూంబాషా, జగన్నాథం, సుధాకర్, మద్దయ్య, మల్లేష్, బషీర్; సలాం, మధు, రాము పాల్గొన్నారు.

టీడీపీకి జై మాదిగ సేవా సంఘం మద్దతు

కర్నూలు(అర్బన్), మే 9: జై మాదిగ సేవా సంఘం తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు కొదమల మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజును కలిసి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో తిరిగి అభ్య ర్థుల తరపున ప్రచారం చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ అనంతరం బాబు దళితుడిని చంపి డోర్ డెలివరీ చేయడం, డాక్టర్ సుధాకర్ మాస్క్ అడిగారని చిత్రహింసలకు గురిచేసి చంపడం లాంటి ఎన్నో సంఘటనలతో నష్టపోయామని వాపోయారు. జిల్లా అధ్యక్షుడు కాటే పోగు రామకృష్ణ, జిల్లా సోషియల్ మీడి యా అధ్యక్షుడు సంధ్యా పోగు సంపత్, ధారా నాగేష్, మురికి రాజేష్‌రె డ్డిపో గు, అంకయ్య పాల్గొన్నారు.

టీజీ భరత్ మంచి నాయకుడు

వైసీపీ చెడు ప్రచారాలను నమ్మవద్దు
పీస్ మెసేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బీఆర్ సిరాజ్



ముస్లింల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ సిరాజ్, టీజీ భరత్, ఎమ్మెల్సీ ఇక్బాల్


సమావేశానికి హాజరైన నగరంలోని ముస్లింలు

కర్నూలు(అర్బన్), మే 9: టీజీ భరత్ మంచి నాయకుడని, అలాంటి వ్యక్తిని ఎన్ను కోవాల్సిన అవసరం ఉందని పీస్ మెసేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బీఆర్ సిరాజ్ అన్నారు. గురువారం రాత్రి పాతబస్తీలోని జమ్మిచెట్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సదస్సుకు మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్, టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు నగరంలో టీజీ భరత్ తరపున మాట్లాడేందుకు వస్తే ఫోన్ కాల్స్ ద్వారా బెదిరింపులు చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. ఎన్నికలు, పండుగలు వస్తూ పోతుంటాయని. వాటిని అక్కడి వరకే చూడాలని అన్నారు. కుల, మతాలకతీతంగా కలిసి జీవనం సాగిస్తున్నామని, కర్నూలులో ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకునే వ్యక్తి.. టీజీ భరత్ అని, ఆ వ్యక్తిని ముస్లిం సమాజం ఆదరించాలని కోరారు. వైసీపీకి చెందిన 22 మంది ప్రజాప్రతినిధుల తరపున ప్రచారం చేస్తే ఏ ఒక్క టీడీపీ నాయకుడు తనను బెదిరించ లేదని, ఇక్కడ మాత్రం ఆ సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి గతంలో ఏ ఒక్క ముస్లింకైనా వ్యతిరేకంగా ప్రవర్తించిందా అని ప్రశ్నించారు. బీజేపీ పేరు చెప్పి టీడీపీపై వైసీపీ తప్పుడు ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ మాట్లాడుతూ టీజీ భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ నెల 13న పోలింగ్ కేంద్రాలకు అందరూ తరలి వచ్చి టీడీపీ అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని కోరారు.

చేనేత కులాల ఆత్మీయ సమ్మేళనం

టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కర్నూలు నగర రూపురేఖలు మారుస్తామని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని మౌర్యాఇన్‌లోని పరిణయ హాలులో చేనేత కులాల ఆత్మీయ సమ్మేళనకార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చేనేత కులాలు, వస్త్ర, రెడీమెడ్ వ్యాపారులతో టీజీ భరత్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే కర్నూలును స్మార్ట్ సిటీగా మారుస్తానని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ భూ యజమానుల హక్కులను హరించి వేస్తుందని అన్నారు.


చేనేత ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న భరత్

కల్లూరు అర్బన్ ప్రజల దాహం తీరుస్తా

- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో యువతకు ఉపాధి
- హామీ పత్రం విడుదల చేసిన పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత


గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన బిలకలగూడూరు వైసీపీ నాయకులు


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న గౌరు చరిత


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గౌరు జనార్దన్‌రెడ్డి

కల్లూరు, మే 9: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పాణ్యం నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై సత్వర చర్యలు తీసుకుంటానని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత పేర్కొన్నారు. గురువారం తన స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో పాణ్యం నియోజకవర్గంలోని ప్రజలకు చేయబోయే పనులపై హామీపత్రం విడుదల చేశారు. అందులో ముఖ్యంగా కల్లూరు అర్బన్‌లోని 16 వార్డులకు రెండు, మూడు రోజులకొకసారి తాగు నీరు అందిస్తున్నారని, తనను గెలిపిస్తే ఈ సమస్యను పరిష్కరిస్తా అన్నారు. అదే విధంగా రైతులకు సాగునీరు అందిస్తానని, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులను పరిష్కరిస్తానని అన్నారు. విద్యావంతులైన నిరుద్యోగ యువత కోసం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో మరిన్ని పరిశ్రమలు తెచ్చి అర్హులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

టీడీపీలో చేరిక

పాణ్యం నియోజకవర్గంలో వైసీపీ నుండి టీడీపీలోకి చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం గడివేముల మండలం బిలకలగూడూరుకు చెందిన 50 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు, నాయకులు పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సువర్ణన్‌రెడ్డి పాల్గొన్నారు. అట్లాగే కల్లూరు మండలం పర్ల గ్రామానికి చెందిన నీలం రామచంద్రుడు, తోల్లరాముడు గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

టీడీపీ కూటమిని గెలిపించండి: గౌరు జనార్దన్‌రెడ్డి

టీడీపీ కూటమిని గెలిపిస్తేనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని గౌరు తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కల్లూరు అర్బన్ 20 వార్డులు ధనలక్ష్మీనగర్‌లో ఆయన ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారంలో పాల్గొని సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, కేతూరుమధు, రాంబాబు, విశ్వం, రఫీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరు: గౌరు చరిత

కల్లూరు, మే 9: రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 36, 37, 41 వార్డులలో ఆమె రోడ్‌షో నిర్వహించి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈసందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే ఎన్‌డీఏ కూటమిలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చేరారని అన్నారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్, నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వ తమ్మ, 36వ వార్డు ఇన్‌చార్జి ఆర్.తిరుమలేశ్వర్‌రెడ్డి, 37, 41వ వార్డు ఇన్‌చార్జి క్రిష్ణవేణి, నాగేశ్వరరావు, జనార్ధన్‌ఆచారి, జే.గంగాధర్‌గౌడ్, కాసాని మహేష్ గౌడ్, శివ, పెద్దబీచుపల్లి, కురువ ధనుంజయ పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి: దస్తగిరి


రోడ్‌షోలో పాల్గొన్న తిక్కారెడ్డి, విష్ణు, దస్తగిరి, నాగరాజు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సి.బెళగల్, మే 9: ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తానని కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం మం డలంలోని పోలకల్లు గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందుగౌడు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ పోలకల్లు గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదక్క, అమర, మాజి మండల కన్వీనర్ తిమ్మప్ప, ఎంపీటీసీలు ఈరన్నగౌడు, బాబురావు, అల్లి రాణెమ్మ, మల్లికార్జు గౌడు, జడ్పీటీసీ గిరిజోన్, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇసుక తోడేళ్లను తరిమేద్దాం: తిక్కారెడ్డి

కర్నూలు: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే తుంగభద్రలో పడి అక్రమంగా ఇసుకను తోడేస్తున్న తోడేళ్లను తరిమి కొడదామని కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. కోడుమూరు నియోజికవర్గంలోని నదీతీర గ్రామాల్లో ప్రచారానికి వస్తుంటే రోడ్డుపై చీమల దండులా ఇసుక టిప్పర్లు వెళ్లుతున్నాయని పేర్కొన్నారు. దీని బట్టి చూస్తే ఐదేళ్లలో వైసీపీ నాయకులు కోట్ల రూపాయలు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. అక్రమంగా సంపాదించిన డబ్బుతో పెద్దపెద్ద భవంతులు నిర్మించుకున్నట్లు ప్రజలకు అర్థమైందని ఆయన వివరించారు. గురువారం కర్నూలు రూరల్ మండలం జి.శింగవరం గ్రామంలో చేపట్టిన టీడీపీ ప్రచారంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఇద్దరు ఈ మండల వాసులేనని ఈసారి కురువ సామాజికవర్గానికి ఎంపీగా చంద్రబాబు అవకాశం ఇచ్చారని అన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఓటుతో జగన్‌కు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ప్రజల ఆస్తులను దోచుకునేందుకు జగన్ కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడలేని విధంగా జగన్‌రెడ్డి మన రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేసి ప్రజల స్థిరాస్తులను ప్రపంచ బ్యాంక్‌కు తాకట్టు పెట్టేందుకు సిద్ధమయ్యారని ఆయన అన్నారు. అనంతరం నిడ్జూరు, రేమట, బి. తాండ్రపాడు గ్రామాల్లో టీడీపీ రోడ్ షో చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిడ్జూరు రాంభూపాల్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వెంకటరెడ్డి, మాజీ సర్పంచు నారాయణ, తాండ్రపాడు సర్పంచు జయన్న, రాజు, సత్రం రామకృష్ణ, జనసేన నాయకులు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడండి: బైరెడ్డి


బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మల్లెల రాజశేఖర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఓర్వకల్లు, మే 9: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని హుశేనాపురం, ఎన్.కొంతలపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో, బహిరంగ సభ నిర్వహించారు. హుశేనాపురంలో బైరెడ్డికి, మల్లెల రాజశేఖర్‌లకు డ్రమ్స్ వాయిద్యాలు, పూలమాలలతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. హుశేనాపురం గ్రామంలో బైరెడ్డికి, మల్లెల రాజశేఖర్‌కు ఎస్ మహబూబ్‌బాషా, చంద్రపెద్ద స్వామి గజమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఓటుతోనే బుద్ధి చెప్పి వైసీపీ పాలనకు చరమగీతం పాడాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. గత వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో నష్టపోయారన్నారు. నంద్యాల పార్లమెంటు వైసీపీ ఎంపీగా పోటీ చేస్తున్న అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డికి ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. వైసీపీ పాలనలో కరువు మండలాలుగా ప్రకటించిన రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా రైతులను మోసం చేశారన్నారు. పోచా బ్రహ్మానందరెడ్డి నకిలీ విత్తనాల వల్ల వైసీపీ పాలనలో రూ. కోట్లు సంపాదించాడని, నకిలీ విత్తనాలతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ప్రవేశ పెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు టీడీపీ అధికారంలోకి రాగనే తక్షణమే రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌బాషా, చంద్రపెద్దస్వామి, సుధాకర్, ప్రశాంత్, రాము, అన్వర్, ఎర్రమల్ల మద్ద్య, పద్మనాభం, గొల్ల నాగరాజు, కేవీ మధు, బజారు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ముస్లింల సంక్షేమం


మాట్లాడుతున్న గోపాల్‌నాయుడు

కోడుమూరు, మే 9: టీడీపీతోనే ముస్లింల సంక్షేమం సాధ్యమని టీఎన్‌టీ యూసీ తాలుకా అధ్యక్షుడు గోపాల్‌నాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాల యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే ముస్లింలకు కల్పించిన 4శాతం రిజర్వేషన్ ఎత్తివే స్తారని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ముస్లిం కోసం నాలు గు శాతం రిజర్వేషన్ కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసిన వ్యక్తి చంద్ర బాబునాయుడు అన్నారు. టీడీపీ ప్రభుత్వం హయంలో హజ్ యాత్రకు వేళ్లే ముస్లింలకు ఆర్థిక సాయం ప్రారంభించింది చంద్రబాబే అని గుర్తు చేశారు. రంజాన్ పండుగకు కానుకలు అందించిన ఘనత టీడీపీదే అన్నారు. కర్నూలు జిల్లాలో ఉర్దూ యూనివర్సిటీని తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. గడిచి న ఐదేళ్లలో ముస్లింలకు వైసీపీ ఏం చేసిందో తెలపాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కౌలుట్ల తదితరులు పాల్గొన్నారు.

స్థాయి సంఘాల సమావేశాలు వాయిదా

కర్నూలు(న్యూసిటీ), మే 9: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి ఒక ప్రకటనలో తెలి పారు. గురువారం నిర్వహించాల్సిన స్థాయి సంఘ సమావేశాలకు కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారులు హాజరయ్యారని, కోరం లేకపోవడంతో ఈ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు సీఈఓ తెలిపారు. జడ్పీ ఛైర్మన్ అనుమతితో ఎప్పుడు నిర్వహిస్తారో తేదీని ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సి.బెళగల్, మే 9: మండలంలోని సంగాల, గుండ్రేవుల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో శకుంతల గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎంపీడీవో వెంట ఎస్ఐ తిమ్మారెడ్డి, బీఎల్‌వోలు ఉన్నారు.

ప్యాలకుర్తిలో వైసీపీకి భారీ షాక్

- టీడీపీలో చేరిన విజయ్‌యాదవ్


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ప్యాలకుర్తి విజయ్‌యాదవ్ తదితరులు

కర్నూలు(రూరల్), మే9: కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ యాదవ్, ఆయన భార్య రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ లలిత వైసీపీకి గుడ్‌బై చెప్పారు. కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ పరిశీలకుడు రామలింగారెడ్డి, ఎంపీ అభ్యర్థి నాగరాజు సమక్షంలో గురువారం విజయ్‌యాదవ్, లలిత తోపాటు మరో 200 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారందరికీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్, రంగా, రవి, వెంకటేష్, సుంకన్న, మద్దన్న, కృష్ణ, వెంకటేశ్వర్లు రామాంజనేయులు పాల్గొన్నారు.

● కర్నూలు రూరల్ మండలం గొందిపర్ల పరిధిలో ఉన్న సుందరయ్యనగర్ చెందిన 50మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి విష్ణువర్ధన్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సీతరాం, ప్రసాద్, గురుమూర్తి, రాజు, దినేష్, పురుషోత్తం ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగరాజు పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఎమ్మిగనూరులో వైసీపీకి బిగ్‌షాక్

● వైసీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య రాజీనామా

ఎమ్మిగనూరు , మే 9: ఎన్నికల వేళ ఎమ్మిగనూరులో వైసీపీకి కోలుకోలేని దెబ్బతగిలింది. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టా రంగయ్య వైసీపీకి రాజీనామా చేశారు. ఈయన రాజీనామాతో నియోజకవర్గంలో మెజార్టీ వర్గమైన చేనేతల్లో తీవ్ర చర్చకు దారితీసింది. బుట్టా రంగయ్య ఆది నుంచి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి ముఖ్య అనుచరుడు. గురువారం కర్నూలులో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన సతీమణి బుట్టా శారదమ్మ ప్రస్తుతం కుర్నీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా కొనసాగుతున్నారు. బుట్టా రంగయ్య రాజీనామా చేయడంతో ఆయన భార్య ఆయన అనుచరులు కూడా రాజీనామా చేసే అవకాశం ఉంది.

బుట్టారేణుక సోదరుడు చంపుతానని బెదిరించాడు :బుట్టా రంగయ్య

వైసీపీ అభ్యర్థిగా బుట్టా రేణుక ఎమ్మిగనూరుకు వచ్చినప్పటి నుంచి తనకు పార్టీలో అవమానాలు, అవహేళనలు, బెదిరింపులు అధికమయ్యాయని, ఒకదశలో నన్ను బుట్టారేణుక సోదరుడు యుగంధర్ చంపిస్తానని బెదిరించాడని బుట్టారంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవమానాలు, బెదిరింపులు తాళలేకే పార్టీకి రాజీనామా చేశానన్నారు. కర్నూలులో మీడియాతో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి తాను పార్టీలో కొనసాగుతూ వస్తున్నానన్నారు. బుట్టా రేణుక సోదరుడు యుగంధర్ బీహార్‌గ్యాంగ్, ఒరిస్సా గ్యాంగ్‌లను పిలిపించి చంపిస్తానని బెదిరిస్తున్నాడన్నారు. ఇప్పుడే ఇలా ఉంటే పొరపాటున ఎమ్మెల్యేగా గెలిస్తే ఎంతటి అరాచకాలకు పాల్పడతారో ఎమ్మిగనూరు ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

3 రోజుల్లో వైసీపీ అడ్రస్ గల్లంతు

● టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి
● నందవరం మండలంలో టీడీపీ శ్రేణుల విస్తృత పర్యటన
● పట్టణంలో గల్లీగల్లీలో ఇంటింటి ప్రచారం





నందవరంలో మాట్లాడుతున్న బీవీ, హాజరైన జనం

నందవరం, మే9: ఐదేళ్లుగా రాష్ట్రంలో అరాచక పాలన సాగించి పీడించిన వైసీపీని మరో మూడు రోజుల్లో అడ్రస్ లేకుండా చేసేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఎమ్మిగనూరు అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ధర్మాపురం, జగ్గాపురం, బాపురం, హలహర్వి, నదికైరవాడి, చిన్నకొత్తిలి, నందవరం గ్రామల్లో ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. బీవీ మాట్లాడుతూ త్వరలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రవేశపెట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలందరి ఆర్థికాభ్యున్నతికి బాటవేస్తారన్నారు. సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ పుష్పావతి, టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు దేశాయి మాధవరావు, ముగతి ఈరన్నగౌడు, గురురాజారావు, రైస్‌మిల్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మీదేవి, గడంగం నరసింహులు, గట్టాల రంగన్న, కాశీంవలీ,మండల పార్టీ కన్వీనర్ డీవీ రాముడు ధర్మాపురం గోపాల్ పాల్గొన్నారు.

కడిమెట్లలో మొదటిసారి ప్రచారం

ఎమ్మిగనూరు రూరల్ 9: కడిమెట్ల గ్రామంలో టీడీపీ నాయకులు కడిమెట్ల బాలరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సొంత గ్రామమైన కడిమెట్లలో టీడీపీ ప్రచారాన్ని నిర్వహించడం ఇదేమొదటి సారి. గ్రామంలోని ప్రజలను కలుసుకొని టీడీపీ ప్రవేశపెట్టబోయే సూపర్-6 పథకాలను వివరించారు. అభివృద్ధి జరగాలంటే టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

పట్టణంలో గల్లీగల్లీలో ఇంటింటి ప్రచారం

ఎమ్మిగనూరు : పట్టణంలో టీడీపీ శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గల్లీగల్లీలో పసుపు జెండాలు చేతబట్టుకొని ఉత్సాహంగా ఇంటింటి ప్రచారం చేశారు. దివంగతనేత స్వర్గీయ మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి పట్టణంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేస్తు టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ సాగారు. పట్టణంలోని 22వ వార్డులో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య చౌదరి ఆధ్వర్యంలో దాదాపు 200 మంది టీడీపీ వీధివీధి తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అలాగే 21వ వార్డులో టీడీపీ కౌన్సిలర్ దయాసాగర్ దంపతులు వినూత్నంగా మహిళలకు బొట్టుపెడుతూ బీవీని గెలిపించాలని కోరుతున్నారు. 15, 16,17వ వార్డు మాజీ కౌన్సిలర్ ముల్లాఖలీముల్లా, వార్డు ఇన్‌చార్జి కామర్తి మహేష్, జయన్న లు విస్తృతంగా ప్రచారం చేశారు. 3వ వార్డులో చేనేత మల్లి ఆధ్వర్యంలోను, 4,5 వార్డుల్లో కౌన్సిలర్ రాందాసుగౌడు, మాజీ కౌన్సిలర్ రంగస్వామిగౌడు, ఎస్సీ కాలనీలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుందర్ రాజు, అంబేద్కర్, షాలెమ్ ప్రచారం చేస్తున్నారు. అలాగే 9,10, 11 వార్డుల్లో కటారి రాజేంద్ర, గుల్లా సలాం విస్తృత ప్రచారం కొనసాగించారు.





మీ బిడ్డల భవిష్యత్తుకు టీడీపీ గ్యారెంటీ అంటూ విక్టరి గుర్తు చూపుస్తున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి

జనమంతా ఓ వైపు.. సైకో జగన్ ఓ వైపు

● కేఈ ప్రభాకర్, కేఈ శ్యాంబాబు
● మద్దికెర మండలంలో టీడీపీ జోరుగా ప్రచారం
● వర్షంలోనూ జననీరాజనం
● టీడీపీ వెంటే మదనంతపురం వాసులు







మద్దికెరలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కేఈ శ్యాంబాబు, ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, ఎమ్మార్పీఎస్‌నాయకులను, వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కేఈ శ్యాంబాబు

మద్దికెర, మే 9: జనమంతా ఓ వైపు ఉన్నారు.. సైకో జగన్ మరో వైపు ఉన్నారు. తప్పకుండా తీర్పు జనం వైపే ఉంటుందని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని పెరవలి, బురుజుల గ్రామాల్లో జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మద్దికెరలో వర్షంలోనూ కూటమి శ్రేణులు, జనం ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా మేళతాళాలతో గజమాలతో సన్మానించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగతా అన్ని వర్గాల ప్రజలు టీడీపీవైపే చూస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం విధ్వంసకరం, అవినీతి, అరాచకాలు, డ్రగ్స్ మాఫియాలతో పాలన సాగిస్తున్నారన్నారు. టీడీపీ ప్రవేశపెట్టబోయే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో పురోగతి ఉంటుందన్నారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల టీడీపీ ఇన్‌చార్జి సుధాకర్‌గౌడు, మాజీ జడ్పీటీసీ పురుషోత్తం చౌదరి, రాజన్న యాదవ్,గూడూరు ధనుంజయుడు, రాజేశ్వర చౌదరి,మెడికల్ తిమ్మప్ప, పారా రవి ఉన్నారు.

టీడీపీలోకి చేరికలు

పత్తికొండ/మద్దికెర: ఎమ్మార్పీస్ రాష్ట వర్కింగ్ ప్రసిడెంట్ బొందిమడుగు రమేష్ టీడీపీలో చేరారు. పత్తికొండ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యామ్‌బాబు కండువ కప్పి ఆయానను పార్టీలోకి ఆహ్వానించారు. అయనతోపాటు గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు టీడీపీలోకి చేరారు.

అలాగే పెరవలి గ్రామ వైసీపీ నాయకులు మాజీ విద్యాకమిటి చైర్మన్ వన్నయ్యతోపాటు మరో 26 కుటుంబాల వారు వైసీపీని వీడి కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

మదనంతపురంలో టీడీపీకి మద్దతు : మదనంతపురం గ్రామంలోని ప్రజలందరూ చందాలు పోగు చేసుకుని ఒక చోట సమావేశమై దాదాపు 80 శాతం మంది ప్రజలు టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుకు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని టీడీపీ నాయకులు ప్రసాద్, గోవిందు, శ్రీనివాసులు, మల్లయ్య, హనుమంతు తదితరుల ఆధ్వర్యంలో సమావేశమై తీర్మానం చేశారు.

మహిళల అభివృద్దే టీడీపీ ధ్యేయం

మద్దికెర : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి కుమారుడు కేఈ హరిబాబు అన్నారు. మద్దికెర గ్రామంలో డీపీఏపీ కమ్యూనిటీ హాలులో మాజీ ఎంపీపీ పద్మావతి అధ్యక్షతన మహిళా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో నెలకు రూ.1500, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచితంగా బస్సు సౌకర్యాన్ని కల్పించారని అన్నారు. కార్యక్రమంలో దివాకర్‌గౌడు, టీడీపీ మహిళా నాయకురాళ్లు జానకీ చౌదరి, లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు.

కబ్జాదారుడిని ఇంటికి పంపుదాం

● ఎన్డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారధి





మాట్లాడుతున్న డాక్టర్ పార్థసారధి, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప

ఆదోని, మే 9: భూకబ్జాదారుడిని ఇంటికి పంపే రోజులు దగ్గరపడ్డాయని, ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఓటు వేసి బీజేపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎన్డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారధి అన్నారు. గురువారం పట్టణంలోని వాల్మీకి సామాజిక వర్గంతో సమావేశమయ్యారు. అనంతరం కుమ్మరగేరి, గణేష్ సర్కిల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడారు. ఆదోని నియోజకవర్గంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. కనీసం తాగేందుకు కూడా నీరులేక గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాను ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తాగునీటి పై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ఆదోనిలో కబ్జాలకు గురైన వారందరికీ న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ప్రస్తుతమున్న ఎమ్మెల్యే సొంత ఊరు ఆదోని కాదని, ఆ వ్యక్తిది అనంతపురం జిల్లా అన్నది మరిచిపోరాదని గుర్తుచేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన మరుక్షణమే ఆదోని ఎలా మారుతుందో ఒక్కసారి చూడాలన్నారు. ఒకే ఒక్కసారి మీ ఇంటి బిడ్డగా దీవించాలని, ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, గెంటెప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

నన్ను గెలిపించండి.. వేదవతి పూర్తి చేస్తా

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్
● నేరణికి, కొత్త పేట, నేరణికితండాలో విస్తృత ప్రచారం
● గూళ్యంలో జన జాతర
● హొళగుందలో కుమార్తె ఐశ్వర్య వినూత్న ప్రచారం
● హెబ్బటంలో 150 కుటుంబాల చేరిక





గూళ్యంలో జరిగిన సభలో మాట్లాడుతున్న వీరభద్రగౌడ్, హాజరైన ప్రజలు

హాలహర్వి, మే 9: నన్ను గెలిపించండి.. వేదవతి ప్రాజెక్టు నిర్మించి ఆలూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానని టీడీపీ ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. గురువారం గూళ్యంలో వీరభద్రగౌడ్ చేపట్టిన ప్రచారానికి అపూర్వ స్పందన లభించింది. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావడంతో ఊరంతా పసుపుమయంగా మారింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వీరభద్రగౌడ్ మాట్లాడారు. 25 ఏళ్లుగా నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరలేదని, ఈసారి రాష్ట్రంలో మొట్టమొదటి విజయం ఆలూరు నుంచే ప్రారంభం కావాలని అభ్యర్థించారు. "ఇక్కడ జలవనరులు పుష్కలంగా ఉన్నాయి. కానీ, ప్రతి పల్లెల్లో తాగునీటి సమస్య ఉంది. గెలుపొందిన వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేసి అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తానని" అన్నారు. నాకు మీరే తమ్ముళ్లు, మీరే కుటుంబ సభ్యులు... ఒక్కసారి గెలుపు కోసం పోరాడండి. వైసీపీని భూస్థాపితం చేయండని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, మండల కన్వీనర్ సుధాకర్, ప్రహ్లాద రెడ్డి, పాలాక్షి, కురువ మల్లన్న, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణమనాయుడు పాల్గొన్నారు.



తండ్రి కోసం ఐశ్వర్య వినూత్న ప్రచారం

హొళగుంద: కూటమి అభ్యర్థి వీరభద్రగౌడ్ విజయాన్ని కాంక్షిస్తూ కుమార్తె ఐశ్వర్య హొళగుందలో వినూత్న ప్రచారాన్ని చేపట్టారు. దిడ్డి కాలనీలోని ఓ హోటల్‌లో టీ చేస్తూ, మహిళలతో కలిసి వెల్లులిలను శుభ్రం చేస్తూ తండ్రిని గెలిపించాలని కోరారు.



రాతనకొత్తూరులో వైసీపీ నుంచి టీడీపీలోకి

తుగ్గలి: రాతనకొత్తూరులో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు కేఈ శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. అంతకుముందు అమీనాబాదులో కేఈ శ్యాంబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రగౌడ్ విజయానికి కృషి చేద్దాం

దేవనకొండ ,మే 9: టీడీపీ ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడ్ విజయానికి పార్టీ నాయకులు ,కార్యకర్తలందరూ ఐక్యంగా కృషి చేయాలని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద మండల నాయకులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. అలాగే స్థానిక లక్ష్మీరంగా పంక్షన్ హాల్‌లో వీరశైవలింగాత్ కులస్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం వీరభద్రగౌడ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

హెబ్బటం నుంచి 150 కుటుంబాలు టీడీపీలో చేరిక

హొళగుంద : హెబ్బటం గ్రామానికి చెందిన 150 కుటుంబాలు వైసీపీ వీడి, వీరభద్రగౌడ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. అలాగే హాలహర్వి మండలం అర్థగేరి గ్రామ వైసీపీ నాయకులు వీరభద్రగౌడ్ తనయుడు గిరి మల్లేష్‌గౌడ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు.



మీ ఇంటి బిడ్డగా దీవించండి

● ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పండి
● మిమ్మల్ని గుర్తించుకుని గుండెల్లో పెట్టుకుంటా..
● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి
● కోసిగి, పెద్దకడబూరు మండలాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం





తుమ్మిగనూరులో సమస్యలు తెలుసుకుంటూ.. మాలపల్లి వైసీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాఘవేంద్రరెడ్డి



తుమ్మిగనూరులో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

కోసిగి మే 9: మీ ఇంటి బిడ్డగా దీవించి ఒక్క అవకాశం ఇవ్వాలని, అందరినీ గుర్తించుకొని గుండెల్లో పెట్టు కుంటానని నియోజకవర్గ ప్రజలను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి కోరారు. "ఎమ్మెల్యేగా నేను గెలిస్తే.. మీరు గెలిచినట్లే.. మీలో ఒక్కడిగా ఉంటా.. ఆపద వచ్చినా, అక్కర వచ్చినా అన్నగా అండగా ఉంటా" అంటూ పేర్కొన్నారు. గురువారం చిన్నభూంపల్లి, పెద్దభూంపల్లి, ఐరంగల్, తుమ్మిగనూరు గ్రామాల్లో టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి రోడ్‌షో నిర్వహించారు. అన్ని గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఘనస్వాగతం పలికారు. అనంతరం రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలనాగిరెడ్డి గ్రామాల్లో కనీసం తాగునీరు కూడా అందించలేదని విమర్శించారు. తనను గెలిపిస్తే మండలానికి రెండు ఎస్ఎస్ ట్యాంకులు నిర్మించి ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. సీఎం జగన్ పట్టాదారు పాసు పుస్తకాలపై తన బొమ్మ వేసుకోవడం ఏమిటని, సొంతంగా సంపాదించుకున్న ప్రజల ఆస్తులపైన జగన్ పెత్తనం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తుమ్మిగనూరు గ్రామంలో బోయ శంకరమ్మ, ఈరన్న దంపతులు పూరి గుడిసెలో నివసిస్తుండటం చూసి పరిస్థితిని తెలుసుకొని చలించిపోయారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇల్లును మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు పల్లెపాడు రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రామక్రిష్ణ, వెంకటేష్, మండల కన్వీనర్ జ్ఞానేష్ చింతలగేని నర్సారెడ్డి, ఈరేష్, నరసింహులు, అయ్యన్న, వక్రాణి వెంకటేశ్, జనార్దన్, హనుమంతు ఉన్నారు.

వైసీపీ నుంచి 130 కుటుంబాలు చేరిక

మంత్రాలయం, మే 9: మండలంలోని మాలపల్లికి చెందిన 105 కుటుంబాలు, కంబలదిన్నెకు చెందిన 25 కుటుంబాలు రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, చంద్ర, లక్ష్మన్న, ముత్తురెడ్డి, రంగస్వామి ఆధ్వర్యంలో వీరంతా తెలుగుదేశం కండువాలు కప్పుకున్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి బీసీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించుకుందామని ప్రతిజ్ఞ చేశారు. అలాగే మాధవరంలో అభ్యర్థి సోదరుడు రఘునాథరెడ్డి, సతీమణి చంద్రిక ఫైబావి క్రిష్ణమోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వడ్డె విజయ్, ఉరుకుందు, భీమిరెడ్డి, నరసింహులు, శ్రీనివాసులు, బొజ్జప్ప, కౌలుట్లయ్య, కేశన్న, తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ మహిళా కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాఘవేంద్రరెడ్డి

నాగలాపురం, కంపాడు గ్రామాల్లో ప్రచారం

పెద్దకడుబూరు : మండల పరిధిలోని నాగలాపురం, కంపాడు గ్రామాల్లో టీడీపీ అభ్యర్థిరాఘవేంద్రరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రచారాల్లో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు మచ్చలేని నాయకుడన్నారు. ఆయన సీఎంగా ఉంటే ఎన్నో అభివృద్ధి పనులు జరగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి, నాయకులు మల్లికార్జున, మీసేవా ఆంజనేయులు, యేసేబు, మల్లకల్లు, మురళి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.